సాక్షి
ఏలూరు
బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



గోదావరిలో మునిగి...

ఆచంట మండలం భీమలాపురంలో గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు పదో తరగతి విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 8లో ▸



ఆక్వాకు అండగా ప్రభుత్వం

ఆక్వా రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి కృతజ్ఞతగా ఉండి మండలం వాండ్రంలో జిల్లా ఆక్వా వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. 8లో ▸

వేసవి తాపం.. ఉపశమనం

జిల్లాలో భానుడు భగభగల నేపథ్యంలో జనం ఉపశమనం కోసం పండ్ల రసాలు, కూల్ డ్రింక్స్ తాగుతూ సేదదీరుతున్నారు. పుచ్చ కాయలకు డిమాండ్ పెరిగింది.



8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సహరి (గురువారం వేకువజాము)
ఏలూరు	6.29	4.21
జంగారెడ్డిగూడెం	6.25	4.23
కైకలూరు	6.28	4.32

న్యూస్‌రీల్

ఫుడ్ కమిషన్ మెంబర్‌గా బాధ్యతల స్వీకరణ



స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలి బాధ్యతలు స్వీకరిస్తున్న గంజిమాల దేవి

కొయ్యలగూడెం: పౌష్టికాహారం అందించి మెరుగైన సమాజాన్ని రూపొందించేందుకు కృషి చేస్తానని ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో ఫుడ్ కమిషన్ మెంబర్‌గా ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పేద, బలహీన వర్గాలకు ఆహారాన్ని అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ కార్యక్రమాలు అందేలా చూస్తానని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాలకు అనుగుణంగా ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ఆధ్వర్యంలో నిర్మాణాత్మకంగా పని చేస్తామని అన్నారు.

పదో తరగతి పరీక్షలకు 995 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పది పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -2, ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు పరీక్షలకు 1068 మంది విద్యార్థులకు 995 మంది విద్యార్థులు హాజరు కాగా 73 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ తెలిపారు.

మూల్యాంకనానికి ఏర్పాట్లు

ఇటీవల నిర్వహించిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 26 వరకూ స్థానిక సెయింట్ గ్జేవియర్ స్కూల్‌లో మూల్యాంకనం జరుగుతుందన్నారు. దీని కోసం ఆరుగురు అసిస్టెంట్ క్యాంప్ అధికారులను, 300 మంది చీఫ్ ఎగ్జామినర్లను, 1000 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను, మరో 300 స్పెషల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను సబ్జెక్టు వారీగా నియమించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు మూల్యాంకన కేంద్రానికి చేరుకుని రిపోర్టు చేయాలని సూచించారు.

రసవత్తరంగా నాటిక పోటీలు



నాన్నా నేనొచ్చేస్తా నాటికలోని దృశ్యం

సాక్షి,భీమవరం: భీమవరం పట్టణంలో కళారంజని కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు మూడో రోజు రసవత్తరంగా సాగాయి. గునుపూడిలోని సోమేశ్వర, జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నాటిక పోటీల్లో మంగళవారం హర్షక్రియేషన్స్ విజయవాడ వారి స్వర్ణకమలాలు, శ్రీ అమృతలహరి థియేటర్స్ ఆర్ట్స్ ప్రదర్శించిన నాన్నా నేనొచ్చేస్తా నాటికను ప్రదర్శించారు. నాటిక పోటీల ముగింపు సందర్భంగా కళారంజని ఆధ్వర్యంలో ముగ్గురు కళాకారులను ఘనంగా సన్మానించారు. రంగ స్థల కళాకారిణి గుడివాడ లహరిని మహనటి సావిత్రి పురస్కారంతో, విజయవాడకు చెందిన స్మృతి సమన్వయిని నాట్య వసంత బిరుదుతో, గుంటూరుకు చెందిన షేక్ బి హసన్‌ను కళారంజిని యువ కళాతేజం అవార్డుతో ఘనంగా సన్మానించారు.

ట్రావెల్స్‌పై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఆర్ఆర్ పేటలోని శ్రీ హనుమాన్ ట్రావెల్స్‌పై టూటౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన అప్పారావు, అతని కుటుంబ సభ్యులు గంగా పుష్కరాలకు యాత్రా స్పెషల్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. వారి వద్ద రూ.లక్షకుపైగా కట్టించుకున్నారు. బంధువుల్లో ఒకరు మరణించడంతో అప్పారావు యాత్రను రద్దు చేసుకున్నారు. చెల్లించిన సొమ్మును తిరిగి ఇవ్వాలని కోరగా నిరాకరించడంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల తోటలకు ఉపాధి నిధులు

- సన్న, చిన్నకారు రైతులకు అవకాశం
- ఏలూరు జిల్లాలో 350 ఎకరాల్లో సాగు లక్ష్యం



ఉపాధిహామీ పథకంలో సాగు చేస్తున్న మామిడి తోట

నూజివీడు: ఉపాధి హామీ నిధులతో పండ్ల తోటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనిలో భాగంగా 100 శాతం రాయితీతో పాటు మూడు నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను సైతం ఇస్తుంది. మెట్ట ప్రాంతంలో పండ్లతోటల సాగును పెంపొందించడమే లక్ష్యంగా దీనిని అమలు చేస్తోంది. అందులో భాగంగా ఏలూరు జిల్లాలో 350 ఎకరాల్లో ఉద్యాన తోటలు అభివృద్ధి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) లక్ష్యంగా నిర్దేశించింది. ప్రస్తుతం రైతులను గుర్తించే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ పథకంలో సంప్రదాయ పండ్లతోటలతో పాటు కొబ్బరి, మల్లె, గులాబీ, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బేర్ తోటల సాగుకు సైతం అనుమతి ఇచ్చారు.

రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు

రైతుల ఆర్థిక సుస్థిరత లక్ష్యంగా 2006–07 నుంచి ఉపాధిహామీలో పండ్లతోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం అన్ని కులాలకు చెందిన 5 ఎకరాల లోపు మెట్ట లేదా 2.5 ఎకరాల మాగాణి భూమి ఉన్న రైతులందరికీ వర్తిస్తుంది.

నీటి వసతి లేకపోయినా

పండ్ల తోటల సాగుకు నీటి వసతి కచ్చితంగా ఉండాలనే నిబంధన లేదు. మెట్టభూముల్లో పండ్లతోటలను సాగు చేసి అభివృద్ధి చేసుకోవచ్చు. పొలం పరిసరాల్లో చెరువు, కాలువ, పెర్కులేషన్ ట్యాంక్ ఉంటే సరిపోతుంది. ఎండాకాలం కూడా నీటిని పెట్టుకునే సదుపాయం ఉంటే సరిపోతుంది. ఉపాధిహామీ జాబ్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పండ్లతోటల సాగుకు మంచి అవకాశం

> పండ్లతోటలు సాగు చేయాలనుకునే రైతులకు ఉపాధిహామీ పథకంలో మంచి అవకాశం ఉంది. అన్ని కులాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మెట్టభూముల్లో పండ్లతోటల సాగుకు ముందుకు వస్తే మంజూరు చేస్తాం. ఇందుకోసం అన్ని మండలాల్లోని ఉపాధి పథకం ఏపీఓలను సంప్రదించవచ్చు.
> – శ్రీదేవి, ఏపీడీ, డ్వామా, నూజివీడు

నేల స్వభావాన్ని బట్టి పండ్ల తోటల ఎంపిక

ఎర్ర, ఇసుక నేలల్లో మామిడి, ఇసుక, ఎర్రగరప తేలికపాటి నేలల్లో జీడిమామిడి, నీరు నిలవని ఎర్రగరప నేలలు, తేలికపాటి నల్ల నేలల్లో బత్తాయి, ఒండ్రు నేలల్లో నాటు జామ, ఇసుకమట్టి, ఒండ్రు, మధ్యరకం నల్ల నేలల్లో సపోటా, ఒండ్రు, ఏ నేలలోనైనా తైవాన్ జామ, ఇసుక నేలల్లో కొబ్బరి, ఎర్ర ఇసుక నేలల్లో, ఒండ్రు నేలల్లో ఆయిల్‌పామ్, అన్ని రకాల నేలల్లో దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, సేంద్రియం అధికంగా ఉండే తేలికపాటి నేలల్లో గులాబీ, ఎర్రనేలలు, ఇసుక నేలల్లో మునగ పంటలను సాగు చేసుకోవచ్చు. రైతుకు గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఉపాధిహామీ పథకంలో సాగు చేసిన పండ్లతోటలకు మూడేళ్ల పాటు పనిదినాలను బట్టి నిర్వహణ నిధులు విడుదల చేస్తారు. నాటిన మొక్కల్లో తొలి ఏడాదిలో కనీసం 50 శాతం పైగా మొక్కలు బతికించుకున్న రైతులకు ప్రతినెలా నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుంది. పూలతోటలకు మాత్రం రెండేళ్ల పాటు మాత్రమే నిర్వహణ ఖర్చులు ఇస్తారు.

మూడేళ్లలో చెల్లించే రాయితీ వివరాలు

పండ్లతోటల రకం	ఎకరాకు మొక్కలు	మూడేళ్లలో చెల్లించే మొత్తం (రూ.లలో)
మామిడి	70	1,02,756
జీడీ మామిడి	70	94,019
బత్తాయి	100	1,05,521
నాటు జామ	110	1,41,784
తైవాన్ జామ	444	2,30,023
సపోటా	60	88,255
కొబ్బరి	60	88,821
ఆయిల్‌పామ్	57	88,821
సీతాఫలం	240	1,70,603
దానిమ్మ	267	2,48,845
నేరేడు	20	18,124
ఆపిల్ బేర్	320	1,06,962
డ్రాగన్ ఫ్రూట్	900	1,79,626
గులాబీ	2000	1,92,500
మల్లె	1600	1,09,672
మునగ	448	1,01,541

వేడుకగా శ్రీపుష్ప యాగోత్సవం



శ్రీపుష్ప యాగోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాధ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసునికి జరుగుతున్న కల్యాణ మహోత్సవాలు మంగళవారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో శ్రీనివాసునికి, పద్మావతి, అండాళ్ అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ యజ్ఞశాలలో హోమాది కార్యక్రమాలను జరిపారు. రాత్రి ఆలయంలో ద్వాదశ కోవెల ప్రదక్షిణలను ఆలయ అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు, భక్తులు వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగోత్సవాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో జరిపారు.

రైస్ మిల్లర్ల బకాయిలు త్వరలో చెల్లిస్తాం

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో రైస్ మిల్లర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైసు మిల్లర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలన్నీ త్వరలోనే చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకులోని ఎగ్ కల్యాణ మండపంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ రైతులు, రైస్ మిల్లర్ల మేలు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేస్తుందన్నారు. రైతులు, మిల్లర్లు, అధికారుల సమన్వయంతో ఈ రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలును విజయవంతం చేయాలని కోరారు. మిల్లర్లకు పాత బకాయిలన్నీ ఒకేసారి చెల్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో బాయిల్డ్ రైస్ కొనుగోలు చేసేందుకు కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ నుంచి అనుమతులు వచ్చినట్లు మంత్రి చెప్పారు. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు.

సొంతింటి కలను సాకారం చేద్దాం

- లక్ష్యాన్ని బాధ్యతతో నెరవేర్చాలి
- అధికారులను మంత్రి జోగి రమేష్ ఆదేశం



ఏలూరు కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, దీఎన్నార్, వాసుబాబు, తలారి వెంకట్రావు, మేకా ప్రతాప అప్పారావు, బాలరాజు, ఎమ్మెల్సీలు జయమంగళ, కవురు శ్రీనివాస్, హౌసింగ్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేర్చే ప్రభుత్వ లక్ష్యాన్ని బాధ్యతతో నెరవేర్చేందుకు పనిచేయాలని గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అధికారులను ఆదేశించారు. నవరత్నాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అమలు జరుగుతున్న జగనన్న ఇళ్లు కార్యక్రమ ప్రగతిపై ఏలూరు కలెక్టరేట్‌లో మంగళవారం గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రభుత్వ కార్యదర్శి అజయ్ జైన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ షా, జిల్లా కలెక్టర్లతో కలిసి ఆయన సమీక్షించారు. ఇళ్ల నిర్మాణం ప్రగతికి చేపడుతున్న చర్యలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను జిల్లాలోని పలువురు శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 30 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందించడంతో పాటు ఇల్లు కూడా నిర్మించి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సొంతిల్లు అనేది ప్రతి పేదవాడికి కల అని, అలాంటి కలను సాకారం చేసేందుకు ఎన్ని వేల కోట్లు ఖర్చయినా ముఖ్యమంత్రి వెనకాడడం లేదన్నారు. ఇలాంటి మహాయజ్ఞంలో అధికారులు, సిబ్బంది ప్రముఖ పాత్ర పోషిస్తూ, జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు నూరుశాతం ప్రారంభమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి శనివారాన్ని హౌసింగ్ డే గా పాటిస్తున్నామని, గృహ నిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారులతో లేఅవుట్లలో సమావేశం నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులన్ని చెల్లించామన్నారు. జగనన్న కాలనీలలో రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పిస్తున్నామన్నారు. వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న 5 లక్షల జగనన్న ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమ లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, సిబ్బంది మనసు పెట్టి పనిచేయాలని మంత్రి కోరారు.

గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పథకానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.10,500 కోట్లు ఖర్చు చేశామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని 2024 సంవత్సరంలోగా పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామని, ప్రస్తుతం 3.50 లక్షల జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి రూ.600 కోట్ల బిల్లులు చెల్లించామన్నారు.

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 1.07 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, వారిలో మొదటి దశలో 87 వేల మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే 80 వేల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, వాటిలో 23,342 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. ఇళ్లను జూన్ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో మండలి సభ్యులు, శాసనసభ్యుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పలు సమస్యలు ప్రస్తావించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ షా, ఎమ్మెల్యే ఆళ్ల నాని, మండలి సభ్యుడు కవురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊళ్లను తలపిస్తున్న జగనన్న ఇళ్లు

సమీక్ష అనంతరం మంత్రి జోగి రమేష్ విలేకరులతో మాట్లాడుతూ.. 30 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తుంటే ప్రతిపక్షాలు ఇళ్ల స్థలాలపై కోర్టుల్లో కేసులు వేస్తున్నారన్నారు. ఎన్ని ఆటంకాలు కలిగించినా జగనన్న ఇళ్ల నిర్మాణం ముఖ్యమంత్రి ఒక యజ్ఞంలా చేపట్టారని చెప్పారు.

బాబు శిఖండి.. పవన్ హైదరాబాదీ

ఏలూరు (మెట్రో) : ఎన్ని కుయుక్తులు పన్నినా.. ఎంతమంది కలిసి వచ్చినా.. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన గృహ నిర్మాణ శాఖ సమీక్షలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు శిఖండిలా వ్యవహరిస్తూ గృహ నిర్మాణాలు సాగకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. సెల్ఫీ పిచ్చితో చంద్రబాబు పిల్ల చేష్టలు చేస్తున్నారని, అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌లకు దమ్మూ, ధైర్యం ఉంటే రాష్ట్రంలోని కోటీ 60 లక్షల ఇళ్లకు రాగలరా... అని మంత్రి ప్రశ్నించారు. చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ దత్తపుత్రుడని, ఆయన హైదరాబాద్‌లో ఉంటూ అప్పుడప్పుడు ఆంధ్రాకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. దత్తపుత్రుడి తోక పట్టుకుని చంద్రబాబు వేలాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ మంత్రి హరీష్‌రావు వస్తే ఆంధ్రాలో అభివృద్ధి చూపిస్తామని చెప్పారు.

ఎస్ఏ-2 పరీక్షలకు సన్నద్ధం

1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు



ఎస్ఏ-2కు సిద్ధమవుతున్న పాఠశాల విద్యార్థులు

నూజివీడు: ఒకటో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలలో భాగంగా సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్ష నిర్వహించేందుకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. పరీక్షల షెడ్యూల్‌ను ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసింది. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు ఈ నెల 20 నుంచి 27 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 20 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11.15 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ షెడ్యూల్‌ను పాటించనున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు పూర్తయ్యాక మధ్యాహ్నం భోజనం పెట్టి విద్యార్థులను ఇళ్లకు పంపాలి.

సీబీఏ విధానంలో పరీక్షలు

సమ్మెటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలను సీబీఏ(క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్) విధానంలో నిర్వహిస్తారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ప్రశ్నాపత్రంతో పాటు ఓఎంఆర్ షీట్‌లు ఇస్తారు. ప్రశ్నకు సంబంధించిన జవాబును ఓఎంఆర్ షీట్‌లో బబుల్ చేయాల్సి ఉంటుంది. ఈ విద్యాసంవత్సరంలో ఓఎంఆర్ షీట్ విధానాన్ని పలు పరీక్షల్లో అమలు చేశారు. ఈ విధానాన్ని ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)-1, 3లలో అమలు చేయగా, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ 4, ఎస్ఏ-1 పరీక్షల్లో పాత విధానంలో నిర్వహించారు.

పరీక్షల షెడ్యూల్ ఇదే

పాఠశాల విద్యార్థులకు ఈ నెల 20 నుంచి నిర్వహించే ఎస్ఏ-2 పరీక్షకు సంబంధించిన టైంటేబుల్‌ను విద్యాశాఖ వారం రోజుల కిందటే విడుదల చేసింది. 20న 1 నుంచి 9వ తరగతి వరకు తెలుగు, 24న 1 నుంచి 5 వరకు ఇంగ్లీషు, 6 నుంచి 9వ తరగతి వరకు సెకండ్ లాంగ్వేజ్, 25న 1–5 వరకు గణితం, 6–9వ తరగతి వరకు ఇంగ్లిషు, 26న 3, 4, 5 తరగతులకు పర్యావరణ శాస్త్రం, 6 నుంచి 9 తరగతులకు గణితం, 27న 3, 4, 5 తరగతులకు ఓరియంటల్ పరీక్ష, 6 నుంచి 9 తరగతులకు సైన్స్, 28న 6 నుంచి 9 తరగతులకు సోషల్, 29న 6 నుంచి 9 తరగతులకు కాంపోజిట్ కోర్సులకు పరీక్షలు నిర్వహిస్తారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న సెట్‌వెల్ సీఈఓ మెహరాజ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ వారసత్వ సంపదను ప్రతి ఒక్కరూ కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలని సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎండీహెచ్ మెహరాజ్ పిలుపునిచ్చారు. ప్రపంచ వారసత్వ దినోత్సవ కార్యక్రమం మంగళవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెహరాజ్ మాట్లాడుతూ వారసత్వ కట్టడాలు పూర్వీకులు మనకు అందించిన ఆస్తి అన్నారు. వారసత్వ కట్టడాలపై విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీ.గిరిబాబు మాట్లాడుతూ దేశంలో పురాతన కట్టడాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయని, విద్యార్థులు వీటి గురించి తప్పక తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ మేనేజర్ పట్టాభిరామన్న తదితరులు పాల్గొన్నారు.

నేరాల నిరోధానికి తనిఖీలు

జిల్లా ఎస్పీ డీ.మేరి ప్రశాంతి



ఏలూరులో విజిబుల్ పోలీసింగ్ చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో నేరాల నిరోధానికి, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్, తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డీ మేరి ప్రశాంతి చెప్పారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్‌డివిజన్, కైకలూరు సర్కిల్ పరిధిలో అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులు మూడు రోజులు పాటు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా 2,036 కేసులు నమోదు చేశారు. ఎస్పీ మేరి ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో నేరాల అదుపునకు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. జిల్లాలో మత్తు పదార్థాల రవాణా, అక్రమ వ్యాపారం, అక్రమ సొమ్ము రవాణా వంటి వాటిని నిరోధించేందుకు నిత్యం విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

క్లుప్తంగా

డాబాపై నుంచి పడి మహిళ మృతి

చాట్రాయి: కోతులు దాడి చేయడంతో భయపడి డాబాపై నుంచి కింద పడటంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సూరంపాలెం గ్రామానికి చెందిన గుడిమళ్ల ముత్యాలు (55) నెల క్రితం తన డాబాపై ఉన్న కోతులను తోలడానికి ఎక్కింది. దీంతో కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేయడంతో డాబా పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను వైద్యం నిమితం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి


చలం గోపి మృతదేహం

నూజివీడు: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించి రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నూజివీడు పట్టణంలోని రామాయమ్మరావుపేటకు చెందిన చలం గోపి (31) మండలంలోని రామన్నగూడెంలోని వండేకారి ద్వారకానాథ్‌కు చెందిన ఆయిల్‌పామ్ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఈనెల 17న సాయంత్రం ఫ్యూజు వేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టమ్ చేసి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

దూరవిద్య ప్రయోగ పరీక్షలకు 363 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. భౌతికశాస్త్ర పరీక్షకు 220 మందికి గాను 190 మంది పాల్గొనగా, 30 మంది గైర్హాజరయ్యారు. రసాయన శాస్త్రం పరీక్షకు 2,103 మందికి గాను 173 మంది హాజరు కాగా 40 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో డీఈసీ కమిటీ ప్రతినిధులు పరీక్షలను తనిఖీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ తెలిపారు.

జగనన్న కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతాం

- గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- ఎమ్మెల్యే వాసుబాబుతో కలిసి భీమడోలులోని జగనన్న, పాత ఇందిరమ్మ కాలనీల పరిశీలన

భీమడోలు: జగనన్న కాలనీలను సర్వాంగ సుందర గ్రామాలు తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, జగనన్న కాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. భీమడోలులోని దిగుడుపాటి దిబ్బ ఏరియాలోని లేఅవుట్‌లో నిర్మిస్తున్న జగనన్న కాలనీని మంగళవారం సాయంత్రం ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆజయ్‌జైన్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీలో రూ.54 లక్షలతో 64 వీధి దీపాల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాలనీలోని మహిళా లబ్ధిదారులతో కొబ్బరికాయ కొట్టించి ప్రారంభించారు. గత ఏడాది గణపవరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించిన తరుణంలో వైఎస్సార్ ఇచ్చిన ఇందిరమ్మ కాలనీలో సదుపాయాలు కల్పించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కోరిన నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, మంత్రి జోగి రమేష్ భీమడోలులోని ఇందిరమ్మ కాలనీ ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీల లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించి కాలనీలోని మహిళలతో మాట్లాడి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఇళ్ల లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉండేందుకు నీటి సౌకర్యం, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాత ఇందిరమ్మ కాలనీలోని 800 మందికి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రత్యేక ఐడీ నంబర్ కల్పించి వీధిలైట్లు, రోడ్లు, మంచినీటి సదుపాయాలను కల్పిస్తామన్నారు. జగనన్న కాలనీ, పాత ఇందిరమ్మ కాలనీ వాసుల సౌకర్యార్థం జాతీయ రహదారికి అనుసంధానంగా గోదావరి కాల్వపై వంతెనను వచ్చే ఏడాది వేసవిలో నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటిని గెలిచిన తర్వాత తుంగలోకి తొక్కాడని, అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీను అమలు చేసి పేదల గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పాత ఇందిరమ్మ కాలనీలో అన్ని సదుపాయాలు కల్పించడం ద్వారా ఈ ప్రాంతంలో 1100 గృహాలు కళకళలాడుతున్నాయన్నారు. తొలుత సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ తదితర ప్రజాప్రతినిధులు సమస్యలపై విన్నతిపత్రాన్ని అందించారు. కాలనీలకు పక్కనే ఉన్న తామర చెరువు అక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించి ఈ కాలనీ వాసులకు మంచినీటి అవసరాల కోసం ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశా, పీడీ వేణుగోపాల్, విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు, ఈఈ టి.శశిధర్, నిర్మాణ విభాగం డీఈ వెంకటే శ్వరరావు, డీఈఈ కె.గోపాలకృష్ణ, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ సభ్యులు తుమ్మగుంట భవానీ రంగ, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీడీవో జీఎల్ఎస్వీ రాఘవన్, తహసీల్దార్ షంషూద్దీన్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, పసుపులేటి సత్యనారాయణ, ఏఈలు సతీష్, రామారావు పాల్గొన్నారు.


భీమడోలులోని పాత ఇందిరమ్మ కాలనీని పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేష్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆజయ్‌జైన్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే వాసుబాబు

పోణంగి లేఅవుట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఏలూరు (మెట్రో): ఏలూరు అర్బన్ లేఅవుట్ పరిధిలోని పోణంగి జగనన్న ప్రధాన అర్బన్ లేఅవుట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)తో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. మంగళవారం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిని మంత్రి జోగి రమేష్ పరిశీలించారు. ఇళ్ల కాలనీల్లో రూ.10 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన విద్యుత్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఇళ్ల కాలనీల్లో మొక్కలు నాటారు. గృహనిర్మాణశాఖ స్పెషల్ సెక్రటరీ అజేయ్ జైన్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎండీ లక్ష్మీషా, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు దూలం నాగేశ్వరరావు, వీఆర్ ఎలీజా, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాస్, నగర కో-ఆప్షన్ మెంబరు ఎస్ ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ దారాపు అనూష, కార్పొరేటర్లు జుజ్జువరపు విజయనిర్మల, మునగాల కేదారీశ్వరినాని, మధ్యాహ్నపు బలరాం పాల్గొన్నారు.


పోణంగి జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాకు స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే ఆళ్ల నాని

23న గురుకులాల ప్రవేశ పరీక్ష

ఏలూరు (టూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లలో ప్రవేశానికై ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల గురుకులాల సమన్వయకర్త పి.వాసవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏలూరు జిల్లా పరిధిలో గల 7 అంబేడ్కర్ గురుకులాల్లో, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని 4 గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. రెండు జిల్లాల్లో 5వ తరగతి సీట్లు 880 కొరకు మొత్తం 3,217 మంది విద్యార్థులు, జూనియర్ ఇంటర్ లోని 880 సీట్ల కొరకు 2,703 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారన్నారు. ఈ నెల 23న ఐదో తరగతి ప్రవేశానికై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కొరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందన్నారు. హాల్ టిక్కెట్లను ఈ నెల 17 నుంచి వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచామన్నారు. హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు ఎదురైన విద్యార్థులు వారు ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌లో పొందుపర్చిన పరీక్షా కేంద్రానికి ముందుగా చేరుకుని నామినల్ రోల్స్‌లో వారి పేర్లను సరిచూసుకుని పరీక్షకు సరైన సమయంలో హాజరుకావాలని కోరారు. విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు ఆధార్ కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ తెచ్చుకోవాలని, పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని వాసవి సూచించారు. ఇతర వివరాల కొరకు 99893 94224, 97048 26744 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆక్వా రంగానికి అండగా ప్రభుత్వం

సాక్షి, భీమవరం: ఆక్వా రంగానికి ప్రభుత్వం అండగా నిలవడం వల్లే నేడు ఆక్వా రైతులు ఆనందంగా ఉన్నారని అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ స్పష్టం చేశారు. ఆక్వా రంగానికి విద్యుత్ సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆక్వా రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్డి రఘురామ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.65 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగుచేస్తుండగా, 64వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వాటిలో 46 వేల కనెక్షన్లకు సబ్సిడీ వర్తిస్తోందని చెప్పారు. ప్రభుత్వంపై అధిక భారం పడుతున్నా రైతులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యుత్ సబ్సిడీని అమలు చేస్తున్నారని వివరించారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా అప్సడాను ఏర్పాటు చేసిందన్నారు. కరోనా సమయంలో రొయ్యల రైతులు అనేక సమస్యలతో నష్టాలను చవిచూశారన్నారు. ఇటువంటి తరుణంలో ముఖ్యమంత్రి జోక్యంతో రొయ్యల కొనుగోలుకు, మేతలు, సీడ్ ధరలు తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఆక్వా రంగం నిలదొక్కుకుందన్నారు. అనంతరం రఘురామ్‌ను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదిరాజు వెంకటసుబ్బరాజు, జిల్లా జాయింట్ సెక్రటరీ రుద్రరాజు యువరాజు, అసోసియేషన్ అధ్యక్షుడు నంబూరి గజపతిరాజు తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, గాదిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.


రఘురామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి


జాన్ బోస్ మృతదేహం


బాలుడు పడిపోయిన నీటి తొట్టె ఇదే

ద్వారకాతిరుమల: అప్పటివరకు ఇంటి ఆవరణలో ఆడుతూ గడిపిన బాలుడిని అంతలోనే మృత్యువు నీటి తొట్టె రూపంలో మింగేసింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దొరసానిపాడుకు తానిగడప రాంబాబు, లత దంపతులకు జాన్ బోస్ (4) ఒక్కడే సంతానం. మంగళవారం సాయంత్రం బాలుడి తల్లి లత రోజులానే కూలి పనులకు వెళ్లగా, తండ్రి రాంబాబు ఇంట్లో నిద్రిస్తున్నాడు. అమ్మమ్మ దిర్శిపాం చుక్కమ్మ పక్కింటికి వెళ్లింది. అదే సమయంలో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడు నీటి తొట్టె వద్దకు వెళ్లగా అందులో కొబ్బరి బొండం చూసి దానిని అందుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తొట్టెలో పడిపోయాడు. ఇదిలా ఉంటే కొద్దిసేపటికి నిద్రలేచిన తండ్రి రాంబాబు బాలుడి కోసం వెతుకుతూ నీటితొట్టె వద్దకు వెళ్లి చూడగా, అందులో బాలుడు తేలుతూ కనిపించాడు. వెంటనే బయటకు తీసి చుట్టుపక్కల వారి సాయంతో ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

● గడపగడపకు సంక్షేమం


మండవల్లి: గన్నవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వృద్ధురాలికి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు


చింతలపూడి: బోయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

గోదావరిలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

- పరీక్షలు ముగిశాయన్న ఆనందంతో స్నానానికి వచ్చి మునక
- స్నేహితుడిని రక్షించే ప్రయత్నంలో ఇద్దరూ మృత్యుఒడికి..

ఆచంట (పెనుగొండ): పదో తరగతి పరీక్షలు ముగిశాయన్న ఆనందంతో స్నానం చేయాలని వచ్చిన ఇద్దరు విద్యార్థులు గోదావరిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. వివరాలిలా ఉన్నాయి. ఆచంట మండలం వల్లూరుకు చెందిన ఉమామహేశ్వరరావు కుమారుడు కామిశెట్టి గిరిధర్, కొండేపూడి శ్రీను అలియస్ విక్టర్ బాబు కుమారుడు భానుప్రసాద్, మరో ముగ్గురు స్నేహితులతో కలసి భీమలాపురంలో మంగళవారం సాయంత్రం గోదావరిలో స్నానానికి వెళ్లారు. అయితే ఏటిగట్టు ప్రాంతంలో పాయ నీరు బాగుండలేదన్న ఉద్దేశంతో మధ్యలో ఉన్న పాయ వద్దకు వెళ్లి స్నానానికి దిగారు. ఈ తరుణంలో కామిశెట్టి గిరిధర్ నదిలో లోతు అంచనా తెలియక మునిగిపోతున్న తరుణంలో మరో స్నేహితుడు కొండేపూడి భానుప్రసాద్ మునిగిపోతున్న గిరిధర్‌ను రక్షించడానికి ప్రయత్నిస్తూ మృత్యువాత పడ్డాడు. దీంతో మిగిలిన ముగ్గురూ అప్రమత్తమై రక్షించమని కోరగా దగ్గరలో ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. స్థానికులు గల్లంతైన విద్యార్థుల కోసం గాలించగా, సాయంత్రం వీరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను వారి బంధువులు స్వగ్రామమైన వల్లూరు తరలించారు. కామిశెట్టి గిరీష్ తండ్రి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండడంతో ఇక్కడ తల్లి సంరక్షణలో ఉన్నాడు. భానుప్రసాద్ తల్లిదండ్రులు ఇద్దరూ గల్ఫ్‌లో ఉండడంతో నానమ్మ వద్ద ఉంటున్నాడు. గ్రామంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. పెనుగొండ ఎస్సై ఎంరాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వల్లూరు వెళ్లి కేసు నమోదు చేశారు.

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆరా

ఘటనపై మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆరా తీశారు. సత్వరం అధికారులు కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని ఆదేశించారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో ఉండడంతో ఫోన్‌లోనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


భానుప్రసాద్, గిరిధర్‌ల మృతదేహాలు

కుమారుడు, బావమరిది చేతిలో వ్యక్తి హతం

ఆగిరిపల్లి: కుమారుడు, బావమరిది చేతిలో వ్యక్తి హతమైన సంఘటన మండలంలోని కొమ్మూరులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆరేపల్లి గాంధీ (48) గతంలో డ్రైవర్‌గా పనిచేశాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడేళ్ల నుంచి మద్యం తాగుతూ ఏ పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. గాంధీ ప్రతిరోజు మద్యం తాగి భార్య రాజేశ్వరిని, పిల్లలను హింసిస్తుండేవాడు. ఈ నెల 17న మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్యతో గొడవపడగా రెండో కుమారుడు అనిల్‌కుమార్ అడ్డుకున్నాడు. అదేరోజు సాయంత్రం సెల్‌ఫోన్, కోడిపుంజులను అమ్మి ఆ డబ్బుతో మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. భర్త ప్రవర్తనతో భయపడిన భార్య మల్లవల్లిలో ఉంటున్న చిన్న కుమార్తె ఇంటికి వెళ్లింది. అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో గాంధీకి, అతని రెండో కుమారుడు అనిల్‌కుమార్, భార్య తమ్ముడైన వేముల శ్రీనివాసరావులకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో గాంధీని అతని కుమారుడు అనిల్‌కుమార్, బావమరిది శ్రీనివాసరావు ఇంటి ఎదురుగా ఉన్న స్తంభానికి కట్టి విచక్షణారహితంగా కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గాంధీ మంగళవారం మృతి చెందాడు. తన భర్త మృతికి తన కుమారుడు, తమ్ముడు కారణమని భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎన్. చంటిబాబు కేసు నమోదు చేయగా, నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు దర్యాప్తు చేస్తున్నారు.


గాంధీ మృతదేహం

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

తణుకు: తణుకులో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతవూరులోని పాత ఏకేటీపీ స్కూలు సమీపంలో గూడూరి కృష్ణయ్య ఇంట్లో గది అద్దెకు తీసుకుని క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న బంగారు సాయిప్రసాద్, గొర్రెల కాశేశ్వరరావు, మాదలవలస సాయిదుర్గాప్రసాద్, మెరుగుపురుగు ప్రదీప్, ఇళ్ల చందులను పోలీసులు అరెస్టు చేశారు. వారి రూ.17,300 నగదు, 12 సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, శాంసంగ్ టాబ్, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ వెల్లడించారు.

ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 8.30 గంటల నుంచి హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. 2022, 2023 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, ఎంఈసీ గ్రూపులు చదివి 75 శాతం మార్కులతో, గణితంలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా నియామకం పొందవచ్చన్నారు. ఇంటర్ బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో చదివిన విద్యార్థులు సైతం జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. ఆధార్‌కార్డు జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ ఫొటోలు, 10వ తరగతి మార్కుల జాబితా, 2022లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఒరిజినల్ మార్కుల జాబితా వెంట తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 85550 85030 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తూతూమంత్రంగా విచారణపై విమర్శలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో బాధ్యుడైన ఉపాధ్యాయ సంఘం నాయకుడైన ఉపాధ్యాయుడిని కాపాడేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీరామ్‌నగర్ ఎంపీయూపీ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహరావు లైంగికదాడికి పాల్పడగా ఈ ఘటనపై డీఈఓ ఆదేశాల మేరకు ఏడీ షరీఫ్‌ను విచారణాధికారిగా నియమించగా, మంగళవారం ఆయన పాఠశాలకు వెళ్లి బాలికలను, హెచ్ఎంను విచారణ చేశారు. ఈ విచారణ తూతమంత్రంగా జరిగిందని, సదరు ఉపాధ్యాయుడి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసి అధికారులు అతనిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుడు క్షమాపణ పత్రం రాసివ్వడంతో సరిపెట్టకుండా ఈ ఘటనను జిలా కలెక్టర్ తీవ్రంగా పరిగణించి జ్యూడీషియల్ విచారణ చేపట్టాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గెద్దం సుధీర్ డిమాండ్ చేశారు. అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

నగరపాలక సంస్థ-ఏలూరు

E-ఫైల్ నెం.-MA020-MISC/15/2022-TPS(1), తేది 17.04.2023

పబ్లిక్ నోటీసు

ఏలూరు జిల్లా, ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో ఆర్.ఎస్.నెం.130/2.3 మరియు 168/1 నందు గల విస్తీర్ణం ఎకర 8.02 సెంట్లు గల క్రింది తెలిపిన సరిహద్దుల మధ్య గల భూమిని వ్యవసాయ భూమి నుండి నివాసయోగ్యముగా మార్పు చేయుటకు ప్రభుత్వము వారు మెమో. నెం.1758952/41/2022 తేది.10.04.2023 నందు ప్రకటన జారీచేసినారు. కావున ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 15 రోజులలో ఏమైన అభ్యంతరములు/సూచనలు ఉన్న యెడల ఈ కార్యాలయమునకు తెలియపరచవలసినదిగా ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సరిహద్దుల యొక్క వివరములు
ఉత్తరము : ఇప్పటికే ఉన్న (Existing) సర్వే నెం.130/1.
తూర్పు : ఇప్పటికే ఉన్న (Existing) మురుగు బోదె.
దక్షిణము : ఇప్పటికే ఉన్న (Existing) సర్వే నెం.168/1(P).
పడమర : ఇప్పటికే ఉన్న (Existing) 80'-00" వెడల్పు మాస్టర్ ప్లాన్ రోడ్.

కమీషనర్,
నగరపాలక సంస్థ, ఏలూరు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ రాజమండ్రి దివాన్ చెరువు '81' గ॥ E/F స్థలము 5 లక్షలు మాత్రమే. DTCP అప్రూవ్డ్ 128 గ॥ స్థలములు సులభ వాయిదా పద్ధతిలో అమ్మకం. ఫోన్ : 95737 07178, 72076 87589 [V-1838]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781957]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1193785]

Wanted

■ Wanted Computer Teachers, Receiptionist, English Teachers P.R.O's work in Tanuku, Jangareddygudem, Eluru. BRAIN TECH org. 91776 42339. [P-1214888]

■ భీమవరం లో సీసీ కెమెరా వర్క్ చేయుటకు హెల్పర్స్ కావలెను. అర్హత: 10th, ITI, INTER ఫెయిల్ మరియు పాస్. రూమ్ + ఫుడ్ ఇవ్వబడును. జీతం: 6,000. 6 నెలల తరువాత జీతం పెంచబడును. సంప్ర: 93928 04906 [P-1233156]

■ స్టేట్ బ్యాంక్ లైఫ్ రాజమండ్రిలో అడ్వైజర్ల నియామకం. అర్హత : 10th. వయస్సు 30 ఆపైన. ఆసక్తి గల అభ్యర్థులు సంప్ర॥ రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలకు, పోస్టల్ మరియు రియల్ ఎస్టేట్ ఏజెంట్స్‌కు ప్రాధాన్యత. ✆ : 94905 94545 [R-932]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్. 3K. Ph: 9848571888 [H-793413]


■ నర్సాపురంలోని మోర్ సూపర్ మార్కెట్ నందు పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ కావలెను. Salary: 11,000/-(8Hours) ESI+EPF కలవు. 9985121999, 9885295999 [G-551]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509588 [G-785852]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటి వద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర॥ 8019995348 [G-785742]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ కాల్ చేయండి. 9573633520, 9059633520 [M-1190671]

■ తాడేపల్లి గూడెం పరిసర ప్రాంతాలలోని ప్రముఖ దిన పత్రికలో మా సంస్థ తరుపున పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కావలెను. అర్హతలు: వయస్సు: 30-45సం॥ ఇంటర్/డిగ్రీ, ఎత్తు: 05-06పైన రిటైర్డ్ ఆర్మీ, పారా మిలిటరీ వారికి ప్రాధాన్యత, లేబర్ యాక్ట్ ప్రకారం జీతం. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 11గం.నుండి మీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సంప్ర॥ సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్, బృందావన్‌గార్డెన్స్, ప్యారడైజ్ రెస్టారెంట్ ప్రక్కన, గుంటూరు. 7095125556, 0863-2951838 [G-29]



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.